# సిరి ఆడించిన ఆట

"ఇదా ఇవాళ్టి మీ సంపాదన ?" హేళనగా వినబడ్డది.

రచ్చబండదగ్గర పురాణంచెప్పి రెండు అరటిఅత్తాలతో ఇంటికి వచ్చిన నారాయణశాస్త్రికి అంతదూరాన ఉండగానే శ్రీలక్ష్మమ్మ ఎదురుగా వచ్చింది - చెంగుదులుపుకుంటూ.

ఆయన మాట్లాడకుండా ఉత్తరీయంలో మూటగట్టిన అరటికాయలను లోపలివరకూవెళ్ళి బుట్టలోపెట్టి, చేతిలోఉన్న పురాణగ్రంథాన్ని గూట్లో భద్ర పరచి కాళ్ళు కడుక్కోటానికి బావిదగ్గరికెళ్ళాడు. చల్లటి బావినీళ్ళతో ముఖం కాళ్లూ చేతులూ కడుక్కోగానే ప్రాణంలేచివచ్చినట్లయింది. చల్లగా తియ్యగా ఉన్న నీళ్ళను దోసిళ్ళతోతాగి ముఖంచేతులూ తుడుచుకుంటూ లోపలికివచ్చాడు.

నారాయణశాస్త్రికి వాకిటి వరెండాలో ఒక పడకుర్చీ ఎప్పుడూ ఉంటుంది. రాగానే దానిమీద వాల్తాడు.

ఇంటికి రాగానే ఆయన మనసులో రెండు ప్రశ్నలు రేకెత్తాయి.

"ఈ లోకంలో గొప్పవాడెవడు ?"

"ఈ లోకంలో గౌరవనీయుడెవరు ?"

సకలశాస్త్రాలూ గురుముఖంగా అధ్యయనంచేసిన నారాయణశాస్త్రికి ఆ ప్రశ్నలకు తెలిసిన అర్థంలేదు. కంటికి కనబడుతున్న అర్థంలేదు.

గడపదాటగానే తానొక పండితుడినన్న ఆత్మవిశ్వాసం ఆయనలో మేలు కొంటుంది ఆ విజ్ఞానం తాలూకు తేజస్సు ముఖమ్మీద తాండవిస్తుంది. అడు గులు గబగబ పడతాయి. తిరిగి వచ్చేటప్పుడు ఏవో శ్లోకాలు మననం చేసు కుంటూ విధిలేక అడుగులు వేసినట్టు వేసుకుంటూ వస్తాడు ఇంటికి.

రాత్రి ఎనిమిదిగంటలయింది. భోజనానికి పిలుపువచ్చింది. దిగ్గునలేచి కాళ్ళు కడుక్కుని పట్టుపంచె కట్టుకుని పీటమీద కూర్చున్నాడు. వడ్డించిన దేదో తలవంచుకొని భోజనం ముగించుకుని లేచాడు.

వాకిట అరుగుమీద అతడికొక మంచంవేసే ఉంటుంది. పొద్దుపోయే వరకూ చేతులు తలక్రింద పెట్టుకుని పడుకుంటాడు ఆలోచిస్తూ - మరునాడు ఏ ఘట్టం పురాణంచెబితే బాగుంటుందీఅని.

బాగా పొద్దుగడిచిన తరువాత అప్పుడు గదిలోకి వెళ్ళి పడుకుంటాడు.

నారాయణశాస్త్రిది నిగూఢసంపద.

కొండలు విరిగి మీదపడినా చలించడు. ఎంతోఅవసరమైతేగాని పెదవి మెదపడు. అతడు భారతంలోని ప్రతిపాత్రను గురించి క్షుణ్ణంగా పఠించాడు. ఆ భారతాన్ని తానున్న ప్రపంచానికి అన్వయించుకుంటాడు. ఆచి ఆచి తూచి తూచి మాట్లాడతాడు.

అదీ అతడిలోని ప్రజ్ఞ.

అతడి ప్రతిభావిశేషాలకు మెరుగుపెట్టటానికేనేమో ఇరవయ్యోఏట పరమేశ్వరశాస్త్రికి ఇల్లరికపుటల్లుడయ్యాడు.

పరమేశ్వరశాస్త్రికి ఆ గ్రామాలలో సంపన్నుడనిపేరు. పళ్ళతోటలూ మాగాణి భూములూ గలవాడు. ఆ ఊరిలో ఆయన కొక్కడికే రెండంతస్తుల మేడఉంది. జరీఅంచుల ధోవతీ ధరించి, ఖండువావేసుకుని, బస్తీలోకొన్న ఖరీదయిన చెప్పులు వేసుకుని ఠీవిగా తలఎత్తుకుని వీధులవెంట ఆయన నడుస్తుంటే ఏడెనిమిదిమంది వందిమాగధులు వెనక ఉంటారు. ఉదయం ఒకసారి, సాయంకాల మొకసారి అలా నాలుగువీధులూ తిరిగి రావటం ఆయనకు అలవాటు. తనవెంట ఎప్పుడూ ఉండేవాళ్ళు లేకపోతే ఆయనకు పెద్దలోటుగా ఉంటుంది. అందరూ మాట్లాడుతూ నడుస్తారు. వాళ్ళసంభాషణల్లో ఆ ఊరివారి సంగతులన్నీ వినబడుతూ ఉంటాయి.

"ఒక మంచి తెలివైనకుర్రాడుఉంటే చూడండయ్యా మా శ్రీలక్ష్మికి. మాఆవిడ ఒకటే పోరుపెడుతోంది సంబంధంచూడమని" అన్నాడు పరమేశ్వర

శాస్త్రి కుర్చీలోకూర్చుంటూ. ఆయన ఆఊళ్లో చందాలువేసి ఒక చిన్నహాలు కట్టించి, చందాదారులనుకూడా చేర్చాడు. పత్రికలు రెండు మూడు రకాలు తెప్పిస్తున్నాడు. అయిదారు కొయ్యకుర్చీలు. ఒక బల్ల తెప్పించిపెట్టాడు. అక్కడే రాజకీయ సాహిత్యోపన్యాసాలు జరుగుతుంటాయి. ఎలక్షను ఉపన్యాసాలు విధిగా అక్కడే జరుగుతాయి. అది ఒక చిన్న రీడింగ్‌రూమ్‌లో లైబ్రరీగా ఉపయోగ పడుతోంది మామూలురోజుల్లో.

"తమకు సాటిఅయిన సంబంధంచూడాలి. పిల్లవాడు బాగా చదువుకున్నవాడు కావాలా?"

"అందం, చందం, ఆస్తి, పేరు, ప్రతిష్ఠలు మనశాస్త్రిగారితో తులతూగ గలిగిన సంబంధంకావాలి" అన్నారొకరు.

"మనకుమించిన సంబంధంవద్దు. పిల్లవాడు కనుముక్కుతీరు బాగుండి కొద్దిపాటి చదువుకున్నవాడుకావాలి. మనం చెప్పినట్టువిని మనయింట్లో ఇమిడి ఉండేవాడుకావాలి. కుదిరితే ఈ మాఘమాసంలో శుభకార్యాన్ని కానిద్దాం. బాగా వెతకండి. మనపిల్ల మనకళ్ళముందరుండాలి."

ఈమాటే అన్నపూర్ణమ్మ భర్తతోఅన్నది—"మనకుమాత్రం ఎవరున్నారు? అమ్మాయి అల్లుడూ పిల్లలతో ఇంట్లో తిరుగుతూఉంటే మనకదే కన్నులపండుగగా ఉంటుంది"అని.

ఎక్కువదూరంపోకుండా, ఎంతోకాలం వెతక్కుండా నారాయణశాస్త్రి కనబడ్డాడు. పెళ్ళిలో మర్యాదచేసి వియ్యంకులను వాళ్ళఊరు పంపించేశాడు పరమేశ్వరశాస్త్రి ఇంటిఅల్లుడుగా నారాయణశాస్త్రికి కొంతకాలం మర్యాదగానే నడిచింది త్వరలోనే అతడు ఒకబిడ్డకు తండ్రిఅయ్యేడు. అమ్మాయికి శకుంతలని పేరు పెట్టారు.

అన్నపూర్ణమ్మా పరమేశ్వరశాస్త్రిగార్లు చనిపోగానే శ్రీలక్ష్మమ్మ ఇంటికి అధికారిణిఅయింది. అసలే మితభాషిఅయిన నారాయణశాస్త్రి నోటివెంట 'అవును-కాదు' అన్న రెండే మాటలు రావటం మొదలుపెట్టాయి.

శ్రీలక్ష్మమ్మకూతురు శకుంతల పెద్దదయింది. ఆమె మంచిచెడ్డలు చూసుకునేతల్లి కొంతవరకూ సంగీతమూ నాలుగోక్లాసువరకూ చదువుచెప్పించింది

పెళ్ళివరకూ. అటుతరువాత ఆమెకు వాటిమీద ఆసక్తి తగ్గిపోయింది. నలుగురినీ సంప్రతించి ఆమె కూతురికి పెళ్ళిచేసింది.

అల్లుడు వెంకటశాస్త్రి కాస్త గడసరి. నిరంకుశురాలయిన శ్రీలక్ష్మమ్మ దగ్గర మర్యాద కనబరుస్తూ నమ్మకస్థుడిలా మెలగటం అలవరచుకుని ఆమెను మెప్పించగలిగినవాడు. బజారుకుపంపిస్తే సరుకులుతెచ్చి "అబ్బ! అత్తగారూ. ఏమిమండిపోతోంది మార్కెట్టు? నిన్నటిధర ఇవాళలేదు. రేపు ఎలాఉంటుందో తెలియదు. ముందుముందు ధరలు ఆకాశాన్నంటుతాయని అక్కడందరూ అనుకుంటున్నారు" అని ఒక చిన్న ఉపన్యాసము ఇచ్చేవాడు.

"అవున్నాయనా! అందరూ అలాగేఅంటున్నారు. అందుకే నేను ఇంటి మనిషివని నిన్ను పంపుతున్నాను" అనేది.

ఇలా అన్నిటిలో డబ్బుమిగిల్చుకుని తన సిగరెట్లకూ పాన్‌బీడాలకూ సినిమాలకూ డబ్బులు సర్దుబాటుచేసుకునేవాడు. ఇటువంటి విషయాలలో అతడి భార్య శకుంతల తోడుగా నిలబడుతూఉండేది.

"అమ్మా, ఇవాళ మంచిసినెమా వచ్చిందట. మేమిద్దరం వెళ్ళాలనుకుంటున్నాము" శకుంతల గారాబాలుపోయేది తల్లిదగ్గర.

"అమ్మాయీ, వారమయినాకాలేదు మీరిద్దరూ సినెమాకువెళ్ళి. ఈ రోజుల్లో ఒక్కసారివెళ్ళడంకూడా ఎక్కువే. మీ రిద్దరూ కొంచెం ఖర్చులు తగ్గించుకోండి. ఇందులో మీ నాన్నకుగాని మీ ఆయనకుగాని నెలజీతాలులేవు. వేరేఆదాయంలేదు. అయినా నీవు అతడు ఆడించిన ఆటల్లా ఆడతావు. నీవయినా కాస్త అతడికి నచ్చచెప్పలేవా?" అన్నది శ్రీ లక్ష్మమ్మ మందలింపుగా,

"ఈ సినెమా ఆఖరిఆట ఇవాళ. అందుకే ఆయన మరీమరీ నీతో చెప్పమన్నారు. నీవు ప్రతిదానికీ ఇలా ఒద్దిస్తుంటే ఆయనకు కోపంరాదూ?"

"ఆఁ కోపంవస్తేనన్నేంచేస్తాడు? ఏదయినా పనిచూసుకుని తన చిల్లరఖర్చులకయినా సంపాదించుకుందామనిలేదు. స్కూల్లో టీచరుగా చేరమంటే ఆ బడి పంతులు ఉద్యోగం చేయనంటాడు. మానాన్న సంపాదించినదంతా సినెమాలకూ షికార్లకూనా? పదహారువాకిళ్ళఇల్లూ, తోటలూ ఏభయిఎకరాల మాగాణిభూమి ఆయన సంపాదించి పెట్టిపోయాడు కనుక మన మిట్లా బ్రతుకుతున్నాం. ఇంత

ఐశ్వర్యము వీళ్ళు కలలోనైనా ఎరుగుదురా?" అంటూ గొంతు పెంచింది శ్రీలక్ష్మమ్మ.

ఆమె 'వీళ్ళు' అనటంలో నారాయణశాస్త్రినికూడా ఉద్దేశించి మాట్లాడింది.

కూతురు "ఇదంతా అనుభవించటానికి కాకపోతే ఎందుకు? చిన్న చిన్న సరదాలన్నా ఈ వయసులో తీర్చుకోకపోతే ఎందుకు ఇదంతాఉండి ఏంభాగ్యం?" అంటూ రుసరుసలాడుకుంటూ గదిలోకి వెళ్ళిపోయింది.

"అలా కాస్తకూ కూస్తకూ కోపగించుకుంటావెందుకు? తీసుకెళ్ళు ఈ పాతిక రూపాయలు" అంటూ వెంటనే పిలిచి చేతికిచ్చింది శ్రీలక్ష్మమ్మ.

నారాయణశాస్త్రికి ఆరోజు మధ్యాహ్నం నిద్రచెడిపోయింది. ఈ అరుపులు చెవినబడుతున్నాయి. తన కెందుకన్నట్టు పక్కకుతిరిగి పడుకున్నాడు. తన వేళకులేచి చెంబెడు మంచినీళ్ళుతాగి షర్టుమీద కండువావేసుకుని రచ్చబండ దగ్గరికి వెళ్ళిపోయాడు. ఆయన తిరిగి వచ్చేసరికి కాస్త పొద్దుపోయింది. కూతురు, అల్లుడూ సినెమాకు వెళ్ళినట్టున్నారు. ఇంట్లోసందడిలేదు. శ్రీలక్ష్మమ్మ పెరట్లో చెట్లపాదులకు పందిళ్ళు వేయిస్తున్నది.

అడుగుల చప్పుడువిని పెరట్లోనుంచివచ్చి ''చేతులూపుకుంటూవచ్చారా? రాత్రికి ఏంతిందామని?'' అన్నది.

ఆయన మాట్లాడకుండా పెరట్లోఉన్న బావిదగ్గరకెళ్ళి కాళ్ళూచేతులూ ముఖం కడుక్కుని, బావిలోని చల్లటినీళ్ళు దోసెళ్ళతోతాగి, లోపలికి వెళ్ళిపోయాడు.

నారాయణశాస్త్రి మజ్జిగన్నం మాగాయ ముక్కతో భోజనంచేసి, వాకిటి మంచమ్మీద చేరుకున్నాడు. మరునాటి కార్యక్రమాన్ని ఆలోచించుకుంటూ.

ఆయనకు చీకట్లు విడగానే లేచే అలవాటున్నది. ఐదుగంటలన్నా కాక ముందే మంచంకింద పెట్టుకున్న రాగిచెంబు తీసుకుని, ఒంటినిండా ఉత్తరీయం కప్పుకుని, తలకు తువాల చుట్టుకుని వాకిలితలుపు దగ్గరగా వేసి, కాలవవైపుకు బయలుదేరాడు, అక్కడే కాలకృత్యాలు తీర్చుకుని ముఖమార్జనచేసి నీళ్ళలోకి దిగాడు. ఆయన గజ ఈతగాడు. కాలవ అటుపక్కనుంచి ఇటుపక్కకు నాలుగు

సార్లు ఈత కొడతాడు. మరీ మనసు బాగాలేకపోతే మరో రెండు మైళ్ళు కూడా ఈతకొట్టే అలవాటుంది.

అప్పుడే తెల్లటి ఆకాశంలోనుంచి నీలిమబ్బులు విడిపోయి తూరుపుదిశ ఎర్రబారుతున్నది. నీళ్ళల్లో నిలబడే ఆదిత్యహృదయం చదువుకుని, గట్టుమీదికి వచ్చి ఒకచోట కూర్చుని జపంచేసుకున్నాడు. స్నానంచేసిన ధోవతిని కాలవ ఒడ్డున ఇసుకమీద ఆరవేసుకున్నాడు. ఆయన శ్లోకాలూ పద్యాలూ చదువుకునే అంతలో ధోవతి ఆరిపోయింది. ధోవతి కట్టుకుని ఉత్తరీయం ఆరేటంతలో ఎర్రగా తోమిన రాగిచెంబునిండా మంచినీళ్ళు నింపుకుని కాలవ గట్టెక్కాడు.

అక్కడికి సరిగా రెండుకోసుల దూరానఉన్న గ్రామానికి బయలుదేరాడు. చల్లటిగాలి వీస్తున్నది. ఏట్లో స్నానంచేసిన దేహం చాలాచురుగ్గా ఉంది. గబగబా అడుగులువేస్తూ గ్రామం చేరుకుని, కోనేట్లో కాళ్ళు కడిగి, దేవాలయంలోకి వెళ్లాడు. ఉండవలసిన దేవుళ్ళూ దేవతలూ దానవులూ అందరు అక్కడే ఉన్నారు. అందర్నీ దర్శించుకుంటూ, మర్చిపోకుండా వెంటతెచ్చుకున్న పురాణ గ్రంథాన్ని తీసుకుని ఒక స్తంభానికి ఆనుకుని చదువుకుంటూ కూర్చున్నాడు.

అప్పటికే దేవాలయం శుచిశుభ్రాలతో-వెలిగించిన దీపాలతో కళకళలాడుతున్నది. భక్తులు ఒక్కొక్కరే రావటం మొదలుపెట్టారు.

ఆనాడేదో పర్వదినంలా ఉంది. మహేశ్వరుడుకి భక్తులు రుద్రాభిషేకం ఒకరి తరువాత ఒకరు చేయిస్తున్నారు. కొందరు కొబ్బరికాయలు కొడుతున్నారు. అర్చకుడు అర్చన చేయించినవాళ్ళందరికీ కొబ్బరిచిప్పలు యిస్తున్నాడు.

రుద్రాభిషేకం చేసేటప్పుడు నారాయణశాస్త్రి కూడా అర్చకుడితో తనకంఠం కలుపుతున్నాడు. "ఇదీ బాగానేఉంది. తనుకాస్త అలుపు తీర్చుకోవచ్చు" ననుకున్నాడు అర్చకుడు. అందుకే చూసీచూడకుండా ఊరుకున్నాడు. భక్తులు ఇద్దరి చేతుల్లో చెరికొంత డబ్బుపెట్టి వెళ్తున్నారు.

పొద్దు ఎక్కినకొద్దీ భక్తుల సందడితగ్గింది. ఇంకా ఒకరూ ఇద్దరూవచ్చి దేవుడికి దణ్ణాలు పెట్టుకుని తీర్థప్రసాదాలు తీసుకువెళ్తున్నారు.

దేవాలయ ప్రాంగణంలో ఒకప్రక్కన అర్చకుడిచ్చిన కొబ్బరి చిప్పలను

వగలగొట్టుకొని తిని, రాగిచెంబులో ఉన్న మంచినీళ్ళు తాగి, గర్భగుడి వెనకాల వరెండాలో పడుకున్నాడు శాస్త్రి.

ఆ సాయంకాలం శివపురాణం ఆ దేవాలయంలో రెండుప్రక్కలా బ్రహ్మాండగా జరిగింది. నారాయణశాస్త్రి పురాణం చెప్పటంలో ఆరితేరినవాడు. పావుగంటలో సగంమంది ఆ పక్కనుంచి ఇటుపక్కకు చేరారు. ఆ దేవాలయ ధర్మకర్తలు అతడి ప్రజ్ఞాపాటవాలను గుర్తించి ఆ దేవాలయంలో ఉండటానికి ఒకగదిని ప్రత్యేకించి, భోజన సదుపాయాలు అమర్చేరు.

నారాయణశాస్త్రి మధ్యాహ్నపు వేళల్లో దేవాలయపు ఆవరణం వెనకఉన్న చెట్టుక్రింద చిన్నపాఠశాల పెట్టాడు. అర్థాపేక్ష లేకుండా వచ్చినవారికందరికీ భజనలూ పాటలూ వినిపిస్తున్నాడు. పురాణం వేళయ్యేవరకూ పాటక జనానికి నీతి కథలు చెప్పేవాడు. వారి మధ్యగల తగవులు తీర్చేవాడు.

నాలుగు నెలలయ్యేసరికి నారాయణశాస్త్రి అందరికీ గౌరవపాత్రుడేకాక కష్టాలకు ఆదుకునేవాడుగా పేరు సంపాదించాడు.

ఒకనాడు ఆ సమీపంలో ఉన్న గ్రామస్థుడు నారాయణశాస్త్రిని తమ గ్రామానికి ఆహ్వానించాడు. అతడికి నలుగురు కొడుకులు. కాని ఒక్కరూ తండ్రికి వ్యవసాయంలో సహాయం చేయకపోవటంచేత కొంతభూమి బీడుగా మారిపోయింది. సంసారంలో కల్లోలాలు బయలుదేరాయి. నారాయణశాస్త్రి వెంటనే తండ్రితో సహా నలుగురికీ భూమిని పంచాడు. అప్పటినుంచీ కొడుకులు ఒకరికొకరు శ్రమదానం చేసుకుని పంటలు పండించుకోవటం మొదలుపెట్టారు.

ఒక గ్రామంలో నలుగురి పొలాలకూ అందవలసిన నీటిని మధ్యలో కాలవను ఒకరైతు తన పొలంవైపుకు మళ్ళించుకున్నాడు. మిగతావాళ్ళ పొలాలకు అందవలసిన నీళ్ళందక పైరు ఎండిపోవటం మొదలుపెట్టింది. ఈమాదిరి సమస్యలన్నీ ఊరంతాతిరిగి పరిష్కరించేవాడు శాస్త్రి. ఆయన తీర్పుకు అందరూ తల ఒగ్గేవారు. ఏ ఒక్కరికీ ఆక్షేపణ ఉండేదికాదు.

ఆ గ్రామస్థులకు నారాయణశాస్త్రిపట్ల ఎనలేని గౌరవమర్యాదలు కలగనారంభించాయి. ఒకరినిచూసి మరొకరన్నట్టు నారాయణశాస్త్రి చిన్నచిన్న గ్రామాలలోకి ఆహ్వానింపబడి వాళ్ళకందరికీ సలహాదారుడై నాడు.

ఆ విధంగా ఆయన అధ్వర్యంలో పది గ్రామాలవరకూ చేరాయి. వాళ్ళకు పోలీసులతోను, గ్రామాధికారులతోను అవసరంలేకుండా నారాయణశాస్త్రి వాళ్ళ సమస్యలను పరిష్కరించటం జరుగుతున్నది. ఒక్కొక్క గ్రామంలో చెట్టుక్రింద బడిపెట్టి చదువు నేర్చినవాళ్ళను మిగతావాళ్ళకు నేర్పించే కార్యక్రమం ఏర్పాటు చేశాడు. రోజువిడిచిరోజు తను ఏదోఒక గ్రామానికి వెళ్ళి భజనకీర్తనలు పాడి ప్రజలనానందపరుస్తూ ఉండేవాడు. కొంతకాలానికి వాళ్ళే భజనలు నేర్చుకుని ఊరంతా ఒకచో భజనలు చేసుకునేవారు. అప్పుడప్పుడువెళ్ళి నీతి మార్గాలను బోధించేవాడు.

కాని- ఈ పనులుచేస్తూ గుడిలో పురాణం మాత్రం మానేవాడుకాదు. ఎక్కడున్నా సమయానికి అందుకునేవాడు.

ఆ దేవాలయ ధర్మకర్తలు నారాయణశాస్త్రి విజ్ఞానానికీ, పాండిత్యానికీ, వచో మాధుర్యానికి ముగ్ధులైనారు. ఆ గ్రామస్థులంతా ఏకమై ఆయనకు ఘనమైన సన్మానం చేయాలనుకున్నారు. ఆ చుట్టుప్రక్కల గ్రామాలవారందరికీ ఈ విషయం తెలిసి యధాశక్తిగా వాళ్ళకు తోచినది తెచ్చి ధర్మాధికారులచేతికిచ్చి వెళ్ళుతున్నారు.

నారాయణశాస్త్రి మనసు ఇప్పుడు చీకటి ఎరుగని వెలుగుతో నిండిఉంది. ఆ వెలుగునే ప్రజలకు పంచి యివ్వాలన్న తపన ఆయనది.

అటువంటి నారాయణశాస్త్రిని ఆ ఊరు దాటనివ్వకుండా చెయ్యటానికి అందరూ కలిసి దేవాలయానికి సమీపంగా ఐదువందల గజాల స్థలంలో గృహ నిర్మాణంచేసి, చుట్టూ కొబ్బరిచెట్లూ పూజాపుష్పాల మొక్కలూవేసి,ఆకర్షణీయంగా తయారుచేశారు.

వైశాఖ పూర్ణిమనాడు నారాయణశాస్త్రికి ఘనమైన సన్మానం జరుగబోతున్నది ఆ చుట్టుప్రక్కల గ్రామీణులందరికీ తెలిసిపోయింది.

నారాయణశాస్త్రి ఇంటినుంచి వెళ్ళిననాడు కూతురడిగింది_తల్లిని "నాన్న ఇంకా ఇంటికిరాలేదు. భోజనం వేళయింద"ని.

"ఆయనకు ఎక్కడా తిండిపుట్టదు. ఏ వేళకయినా వస్తారులే" అంది విసురుగా తల్లి.

మరునాటివరకూ చూసి"ఏ ఊరయినా వెళ్లదలచుకుంటే చెప్పివెళ్ళొచ్చుగా?" గొణుక్కుంది శ్రీలక్ష్మమ్మ.

మరో రెండురోజులు మూగగా గడిచాయి.

"విశ్వాసం లేనివాళ్ళను గురించి ఏమంటే ఏం లాభం ?" మళ్ళీ కూతురడిగిన దానికి సమాధానమిచ్చింది తల్లి.

ఇది జరిగిన నాలుగురోజులకు "అమ్మా, నా పెట్టెలోఉన్న గొలుసు చూశావా ? వారంరోజుల క్రిందట పెట్టెలో పెట్టానమ్మా, ఇప్పుడుచూస్తే లేదు" ఆందోళనపడుతూవచ్చింది తల్లిదగ్గరికి.

"అయ్యో, పన్నెండు నవర్సుల గొలుసది. అత్తవారు. ఏంపెట్టలేదని నలుగురూ ఆక్షేపిస్తారని మా అమ్మది నీ మెడలోవేశాను. బాగా వెతుకు. నేనూ వస్తున్నాను" అంటూ కూతురి గదిలోకి వెళ్ళింది శ్రీలక్ష్మమ్మ.

పెట్టెలోఉన్న బట్టలన్నీతీసి బైటపడేశారు. బీరువాలన్నీ వెదికారు. గూళ్ళన్నీ ఖాళీచేశారు. నారాయణశాస్త్రి గదంతా వెతికారు. ఆయన పుస్తకాలన్నీ కిందపడేశారు. వంటయిల్లూ సామానుగదీ మొత్తం ఇల్లంతా క్రిందుమీదులు చేశారు. ఇద్దరికీ చెమటలుపోశాయి. గాభరాపడిపోతున్నారు.

సరిగ్గా ఆ సమయంలో వెంకటశాస్త్రి ఇంట్లో అడుగుపెట్టాడు. అతడు రాగానే శకుంతల సంగతంతా చెప్పింది.

"ఎన్నాళ్ళయింది కనబడక ?" గడపలో నిలబడే అడిగాడు.

"పెట్టెలోపెట్టి వారంరోజులయింది. ఇవాళచూస్తే లేదు. ఇల్లంతా వెతికారు"

శకుంతల గొలుసు కనబడనందుకు కాదుగాని మరునాటి సినిమా ప్రోగ్రామ్‌కి ఇదొక అవరోధంగా ఏర్పడిందన్న బాధ కలిగిందతడికి.

"కనబడకపోతే పోలీసు రిపోర్టుఇచ్చి రమ్మంటారా?" తొందరపెట్టాడు అల్లుడు.

శ్రీలక్ష్మమ్మ నట్టింట కూలబడిపోయింది.

తండ్రి పరమేశ్వరశాస్త్రి యిచ్చిన చిల్లిచెంబు కూడా ఎటూపోకుండా కాపాడుకుంటూవచ్చింది. ఆటువంటిది ఈనాడు అంత విలువైన వస్తువుపోయింది.

ఎవరిని అనగలదు ?

"ఇంట్లోఉన్న మగవాళ్ళిద్దరూ పేదరికంవల్ల ఇల్లరికం వచ్చినవాళ్ళే". ఆమె దృష్టి వాళ్ళవైపు మరలింది.

అంతలో వెంకటశాస్త్రి "అత్తగారూ, మామగారు ఇంటినుంచి వెళ్ళి ఎన్నాళ్ళయింది ?" ఏదో స్ఫురించినట్టుగా అన్నాడు.

"ఆం. ఆరేడు రోజులపైన కాలేదూ ?" అన్నదామె సందేహిస్తూ.

"మీరేమనుకోనంటే నేను పోలీసు రిపోర్టు ఇచ్చివస్తాను. ఏమంటారు ? ఆయన అటువెళ్ళగానే ఇంట్లో పెట్టెలో ఉన్నవస్తువు పోయిందంటే అది చిన్న విషయమా !" చాలా బాధ్యతగలవాడిలా మాట్లాడాడు.

"రెండురోజులు ఆగు నాయనా. చూద్దాం పాలేర్లనూ పనిమనిషినీ చాకలి దాన్నీ అడుగుదాము. వాళ్ళను అడిగి భయపెట్టి చూద్దాం." అంది.

ఆ రెండోరోజు రాత్రి శ్రీలక్ష్మమ్మ పెట్టెలో ఉన్న నగలమూట మాయ మయింది. ఈ సంగతి ఆమె తెలుసుకునేసరికి సాయంత్రమయింది. సాధారణంగా ఆమె ఆ పెట్టెను రోజూతెరవదు.

"ఇంక ఆగటానికి వీలులేదు." అంటూ పోలీసు రిపోర్టు ఇవ్వటానికి అల్లుడు వెళ్ళాడు.

అత్తగారూ, విచారించకండి. తప్పకుండా దొరుకుతుందని నాతో ఇన్స్పెక్టరు చెప్పాడు. జాగ్రత్తగా మన వస్తువులు మనకు తెచ్చిస్తారన్నాడు." వెంకటశాస్త్రి నమ్మకంగా చెప్పాడు.

ఆమె కళ్ళుతుడుచుకుని అతడి మాటలు జాగ్రత్తగా వింటోంది.

"నగలు తెచ్చి చూపిస్తే మీరు గుర్తు పట్టగలరా? అత్తగారూ?" అడిగాడు.

"నా నగలు నేను బాగా గుర్తుపట్టగలను. అంత బరువు కలవి ఇక్కడ

ఎవరికీలేవు. అయినా ఆ రకాలు ఇక్కడ తయారుకావు. మా నాన్న ఎక్కడెక్కడి నుంచో తెప్పించాడు." అన్నది ధీమాగా శ్రీలక్ష్మమ్మ, తెల్లవారి శ్రీలక్ష్మమ్మ నిద్రలేచేసరికి తలుపులన్నీ దగ్గరగా వేసి ఉన్నాయి.

శ్రీలక్ష్మమ్మ భయంతో తలుపులు నెట్టిచూస్తే వెంకటశాస్త్రి గదిలోలేడు. శకుంతల నిద్రపోతున్నది.

శ్రీలక్ష్మమ్మ పాలేర్లను పంపించి ఊరంతా వెతికించింది. ఆమెకు మొదట నారాయణశాస్త్రి మీదనే అనుమానం కలిగింది. ఆయన చేయలేదు కాని చేయించి ఉంటాడన్న అనుమానాన్ని వెంకటశాస్త్రి కలిగించాడు. ఇప్పుడా అనుమానం వెంకటశాస్త్రి మీదినుంచి నారాయణశాస్త్రి మీదికి మళ్ళింది.

సరిగ్గా నారాయణశాస్త్రికి అక్కడ సన్మానం పూర్ణకుంభాలతో సన్నాయి మేళంతో జరుగబోతున్నది కొన్ని రోజులలో. ఇక్కడ శ్రీలక్ష్మమ్మకు కన్నీళ్ళు కాలవలై పారుతున్నాయి. గుండె మండిపోతున్నది.

పోలీసు ఇన్స్పెక్టరు తన అనుచరులతో వచ్చి ఇల్లంతా గాలించి చూశాడు.

"మీకెవరిమీదనయినా అనుమానంగా ఉన్నదా?" అడిగాడు.

"నాకు ఎవరిమీద అనుమానమున్నదని చెప్పను? మా ఆయన ఇంటినుంచి వెళ్ళిపోయారు. మా అల్లుడు కూడా నిన్నటి నుంచీ కనబడటంలేదు." అన్నది కళ్లు తుడుచుకుంటూ శ్రీలక్ష్మమ్మ.

"ఆ యిద్దరిలో ఎవరిమీద అనుమానమెక్కువ?"

"మా ఆయన వెళ్లే వరకూ అన్ని ఉన్నాయి. ఆయన వెళ్ళిన తరువాతనే మా అమ్మాయి పెట్టెలో పెట్టిన గొలుసు కనబడలేదు. ఆ తరువాత రెండు రోజులయినా కాకముందే నా గదిలో పెట్టెలో పెట్టిన నగలమూట మాయమయింది. ఇద్దరూ ఇల్లరికం వచ్చినవాళ్ళే" అన్నది.

"మీ కేసు నమోదు చేసుకున్నాము. మీ నగలు మీకు లభించే ప్రయత్నం చేస్తాము." ఇన్స్పెక్టరు తన సిబ్బందితో వెళ్ళిపోయాడు.

సుమారు నాలుగు నెలలయిన తరువాత వెంకటశాస్త్రిని తీసుకువచ్చి "ఇతడేనా మీ అల్లుడు?" అంటూ పోలీసులు వచ్చారు.

"అవును, ఇతడే" అన్నారు శ్రీలక్ష్మమ్మా శకుంతలా. "ఇంటి పనులన్నీ ఏది చెప్పినా ఓపికగా చేసేవాడు. కాని ఖర్చు మనిషి" అన్నది శ్రీలక్ష్మమ్మ

"నగలసంగతి మా పోలీస్‌స్టేషన్‌కి తీసుకువెళ్ళి తేలుస్తాము. ఇక్కడ తేలదు." అంటూ పోలీసు వాళ్ళు వెంకటశాస్త్రిని తీసుకుపోతుండగా "నన్ను ఒక్కడినే తీసుకుపోతారెందుకు?" మా మామగారు కూడా ఇల్లరికపుటల్లుడే. ఆయన నగలు తియ్యలేదని ఏంనమ్మకం?" అంటూ గొణిగాడు వెంకటశాస్త్రి.

అనుమానంమీద నారాయణశాస్త్రిని కూడా పోలీసువారు విచారణ జరిపించారు. ఆయన ఉన్న గ్రామంలో అందరినీ అడిగారు. ఆయనకు వ్యతిరేకంగా ఏసాక్ష్యమూ దొరకలేదు. ఆయన పేరు వినగానే చేతులెత్తి దణ్ణాలు పెట్టారు. కాని వెంకటశాస్త్రి మరో ఇద్దరిని కూడగట్టుకుని ఈ నగలతో రాష్ట్రం దాటటానికి ప్రయత్నించినట్లు ఋజువైంది. ఆ యిద్దరి కోసం పోలీసువారు గాలించటం మొదలు పెట్టారు.

నెలలు గడుస్తున్నాయి. కాని నగల ఆచూకీ గాని వెంకటశాస్త్రితో కలిసిన ఇద్దరు నేరస్తులు గాని దొరకలేదు.

"అమ్మా, నగలు దొరికాయని పోలీసువారితో ఆయనను విడిచించమని చెప్పు" అని శకుంతల ఇంట్లో గొడవ చేస్తున్నది. కేసును విత్‌డ్రా చేసుకోవటం శ్రీలక్ష్మమ్మకు ఇష్టంలేదు. దీనిలో నారాయణశాస్త్రి ప్రోద్బలం ఉందేమోనన్న అనుమానం మాత్రం ఆమెను పీడిస్తున్నది.

నెలలు గడుస్తున్నకొద్దీ శకుంతలపోరు ఎక్కువైయింది. శ్రీలక్ష్మమ్మ చివరకు పోలీసువారికి చేతినిండా వందరూపాయల నోట్లిచ్చి వెంకటశాస్త్రిని విడిపించింది. కాని చాలా జాగ్రత్తగా అతడిమీద ఒక కన్ను వేసి ఉంచింది.

అంతలో నారాయణశాస్త్రికి గ్రామంలో ఘనసన్మానం జరగబోతున్నదన్న వార్తలు వినవచ్చాయి.

శ్రీలక్ష్మమ్మ "ఆ ముఖానికి సన్మానాలు కూడానా?" ఈసడించి పడేసింది. శకుంతల మాత్రం అక్కడికి వెళ్ళి చూడాలని పట్టుబట్టింది. తల్లీ కూతుళ్ళిద్దరూ బండి కట్టుకుని నారాయణశాస్త్రి ఉన్న గ్రామంచేరారు.

ఆ గ్రామంలో వీధివీధికీ తోరణాలు కట్టారు. దేవుడి పెళ్ళికి తిరిగినట్టుగా గ్రామస్థులు తిరుగాడుతూ ఉన్నారు. పనులు చేస్తూ ఉన్నారు. ప్రజలు బళ్ళు కట్టుకుని తీర్థానికి వచ్చినట్టుగా వచ్చారు.

నారాయణశాస్త్రిని పూర్ణ కుంభాలతో సన్నాయి మేళంతో తీసుకువచ్చారు. తోరణాలుకట్టి పూజలు చేసిన కొత్తయింట్లో ఆయనను పీటమీద కూర్చోబెట్టి పూలహారాలువేసి పట్టు వస్త్రాలతో పట్టు శాలువలతో సన్మానం చేశారు. పూల హారాలూ పట్టువస్త్రాలూ గుట్టలుగా పక్కకు పెట్టారు. సుమారు రెండు గంటల వరకూ గ్యాస్‌లైట్ల వెలుగులో ఈ పురస్కారాలు జరుగుతూ ఉన్నాయి.

చివరకు నారాయణశాస్త్రిలేచి అందరికీ నమస్కరించి, కృతజ్ఞతలు తెలిపి వచ్చిన పెద్దలందరికీ తను సన్మానాలు చేశాడు. తనకు వచ్చిన వస్త్రాలు శాలువలు దానంచేశాడు. తన కొరకు నిర్మాణమయిన ఆ గృహాన్ని మఠాచార్యులకు విడిది గృహంగా ఉంచమని కోరాడు. తాను మాత్రం ఎప్పటి మాదిరిగా భజన కీర్తనలు పాడుకుంటూ గర్భగుడి వెనుక వరెండాలో పడుకుని మంత్రాలు చదువుతూ రుద్రాభిషేకాలు చేయించటమే పనిగా పెట్టుకున్నాడు.

విశాలమైన ఫాలభాగమ్మీద విభూతి పట్టెలతో-తేజస్సును వెలిగ్రక్కే విశాలనయనాలతో - చిరునవ్వులతో నారాయణశాస్త్రి దేవాలయపుటరుగుమీద కూర్చుంటే అక్కడికి వచ్చిన వాళ్ళు పాదాభివందనంచేసి దైవదర్శనానికి దేవాలయ ప్రవేశం చేసేవారు.

శ్రీలక్ష్మమ్మకు నారాయణశాస్త్రే ఆ నూతన గృహాన్ని తన నగలతో కట్టించుకున్నాడేమోనన్న అనుమానం మాత్రం పోలేదు. "ఇంట్లో ఈ పనులు బయట ఘనసన్మానాలు ఈయనగారికి నిజం బయట పడిన్నాడు తెలుస్తుంది అసలు సంగతి." అంటూ పెదవి విరిచింది గొణుక్కుంటూ.

శకుంతల "అమ్మా, ఆ శాలువల కుప్పలు చూశావా? పట్టు వస్త్రాల దొంతరలూ ఆ పూలహారాలూ ఎంత ఎత్తున పడి ఉన్నాయో చూశావా? వాటి నన్నిటిని అందరికీ ఇచ్చేస్తున్నాడు. నన్ను దగ్గరికి వెళ్ళనివ్వక పోతివి. నేను కొన్నిటినయినా తీసుకునేదాన్ని" అంటూ విచారపడ్డది.

"అవెందుకే మనకు? "దొంగసొమ్ము దొరలపాలు" అన్నట్టుగా ఉంది.

ఆయనను ఇష్టం వచ్చినట్టు చేసుకోనీ, మనం పోదాంరా." అంటూ కూతుర్ని తీసుకుని బండీమీద వెళ్ళిపోయింది.

వాళ్ళ రాకపోకలు ఆయన చూస్తునే ఉన్నాడు.

ఇది సిరి ఆడించిన ఆట క్రింద జమ కట్టాడు నారాయణశాస్త్రి.

* * *